క్లుప్తంగా

నేటి నుంచి పిల్లలమర్రిలో ఉర్సు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం సమీపంలోని పిల్లలమర్రి హజ్రత్ సయ్యద్‌షా కమాల్ హుస్సేనీ చిస్తీ, సయ్యద్ షా జమాల్ హుస్సేనీ చిస్తీ రహిమతుల్లా అలై దర్గా 648వ ఉర్సు నేటి నుంచి ప్రారంభం కానున్నట్లు ముతవల్లి షా మహ్మద్ ఫజల్‌ఖాన్ తెలిపారు. ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 17న గంధోత్సవం ఊరేగింపు ఉంటుందన్నారు. 18న ఉత్సవాల ముగింపు ఉంటుందన్నారు.

పొట్టి శ్రీరాములుకు నివాళి



జడ్చర్ల టౌన్: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని వాసవీ కమాన్ వద్ద ఆర్యవైశ్య సంఘాల నాయకులు నివాళి అర్పించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. నాయకులు పాలాది రామ్మోహన్, కొత్రమధు, మూటూరు విజయ్, అమరవాది ప్రభు, హైమావతి, గంధంజ్యోతి పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

దేవరకద్ర రూరల్: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్న ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేష్ కథనం మేరకు... నాగారం గ్రామానికి చెందిన తూర్పు రాఘవులు గురువారం రాత్రి పెద్దరాజమూర్ వాగులో నుంచి టిప్పర్‌లో ఇసుక తరలింపు చేపట్టాడు. దీంతో స్థానికుల సమాచారం మేరకు పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి వసతికి చర్యలు

గండేడ్: రుసుంపల్లి పరిధిలోని బోయగుడిసెల్లో కొంతకాలంగా నీటిసమస్య స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తోంది. మిషన్ భగీరథ నీరు గానీ, స్థానికంగా బోరు కానీ లేదు. ఈ నేపథ్యంలో రుసుంపల్లికి చెందిన చెందిన సుంకిరెడ్డి నరోత్తంరెడ్డి సొంతఖర్చుతో శుక్రవారం నూతనంగా బోరు వేయించారు. శనివారం నుంచి నీరు సరఫరా జరిగేలా చూస్తామన్నారు. ప్రజలు బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని కోరారు.

18న సర్వసభ్య సమావేశం

గండేడ్: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 18న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మాధవి అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి హాజరవుతారని వివరించారు. అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపొందించాలి

దేవరకద్ర రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి అని మండల నోడల్ అధికారి బలరాం అన్నారు. శుక్రవారం పెద్దరాజమూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఎఫ్‌ఎల్‌ఎన్ అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలన చేసి విద్యార్థుల హాజరుశాతం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కవిత, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, వసంతలక్ష్మి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మహబూబ్‌నగర్ రూరల్: ఎమ్మార్పీఎస్ జిల్లా నూతన కార్యవర్గాన్ని వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ సూచన మేరకు శుక్రవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం.శ్రీరాములు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కె.ఖాదరయ్య, అధికార ప్రతినిధిగా వినోద్‌కుమార్, అదనపు కార్యదర్శిగా కె.కేశవులు, కోశాధికారిగా ఎం.రామచంద్రయ్య ఎన్నికయ్యారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా డి.కాన్షీరాం, గోపీ బాలరాజు, బొక్కి రాములు, బాలరాజు, సంయుక్త కార్యదర్శులుగా నగిరే యాదయ్య, ఎం.సురేందర్, ఎస్.బాలకృష్ణ, పి.శ్రీనివాసులు, బండారి రాములుతో పాటు పలువురిని ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శి కృష్ణయ్య, ఎంఈఎఫ్ నాయకులు వెంకటస్వామి, పోలే బాలయ్య, జె.బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ వైస్ ఛాన్సలర్ లక్ష్మీకాంత్‌రాథోడ్ పుట్టిన రోజు సందర్భంగా జిల్లా కేంద్రంలోని సాందీపని ఆవాసంలో పండ్లు, పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. ఆవాసం సభ్యులు బాలయాదవ్, చంద్రయ్య, ఈశ్వరన్న తదితరులు పాల్గొన్నారు. వేడుకల్లో లక్ష్మీకాంత్ రాథోడ్ చిన్ననాటి మిత్రులు, ఉపాధ్యాయులు కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

పెండింగ్ బిల్లులు వచ్చేనా?

- పదవీ కాలం దగ్గర పడడంతో సర్పంచ్‌ల్లో ఆందోళన
- పంచాయతీలకు అందని అభివృద్ధి పనుల బకాయిలు
- దాదాపుగా రూ. పది కోట్లు పెండింగ్



తీగలపల్లిలో పూర్తి చేసిన సెగ్రిగేషన్ షెడ్డు

నవాబుపేట: మండల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లకు అభివృద్ధి కోసం చేసిన అప్పులు తీరుస్తామో లేదోనన్న ఆందోళన మొదలైంది. పదవీ కాలం పూర్తికావడానికి పట్టుమని నెల రోజులు కూడా లేకపోవడం ఒకవైపు, ప్రభుత్వం మారడం మరోవైపు తాము చేసిన పనులకు సంబంధించిన బిల్లులు వస్తాయో లేదోనన్న భయాన్ని వారికి కలిగిస్తున్నాయి. పనులకు సంబంధించిన బిల్లులు వస్తాయి, ఎప్పుడైనా అప్పులు తీర్చుకోవచ్చులే అనుకున్న తరుణంలో ఇలాంటి పరిస్థితి ఎదురుకావడం వారికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి బకాయి బిల్లుల భయం పట్టుకుంది. గత ఏడాది పల్లెప్రగతితో గ్రామాల్లో అభివృద్ధి పనులను పోటీపడి పూర్తి చేసిన సర్పంచ్‌లకు తాజాగా కొత్త సమస్య వచ్చి పడిందనే చెప్పాలి. పనుల కోసం అప్పులు తీసుకొచ్చిన వారు వడ్డీలు పెరుగుతుండడం, బిల్లులు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. మండలంలో పల్లెప్రగతిలో భాగంగా శ్మశానవాటికలు, సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించారు. కాగా శ్మశాన వాటికకు రూ. 12.60 లక్షలు, షెడ్లకు రూ. 2.50 లక్షల చొప్పున వారికి రావాల్సి ఉంది. కాగా బిల్లులు ఇంకా సగం కూడా రాకపోవడం గమనార్హం. వీటికి తోడు సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం వంటివాటి బిల్లుల ఊసేలేదు. దీంతో చేసిన పనులకు బిల్లులు వస్తాయా లేదా అనే అనుమానం రావటంతో సర్పంచ్‌లు ఆందోళన చేందుతున్నారు. అసలే పల్లె ప్రగతి పనులపై రాజకీయ దూమారం చెలరేగుతున్న తరుణంలో వాటి ఫైనల్ బిల్లులు అందుతాయో లేదోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా సర్పంచులు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే అధికారులు మాత్రం పట్టించుకోవటం లేదు.

రూ. పది కోట్ల వరకు పెండింగే..

మండలంలో మొత్తం 54 పంచాయతీలలో పంచాయితీ రాజ్ శాఖ ద్వారా 24 గ్రామాలు, ఉపాధి పథకంలో 30 గ్రామాలలో పల్లెప్రగతి పనులు చేపట్టారు. కాగా నేటికీ కొన్ని పంచాయతీలకు మాత్రమే రూ. కోటి వరకు వచ్చాయి. అదేవిధంగా మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలకు సంబంధించి రూ. 2 లక్షల చొప్పున బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. సీసీ రోడ్లకు సంబంధించి ప్రతి పంచాయతీలో రూ. 2 నుంచి రూ. 5 లక్షల వరకు ఏడాదిన్నరగా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇలా గ్రామాల్లో చేసిన వివిధ పనులకు సంబంధించి సర్పంచ్‌లకు దాదాపుగా రూ. పదికోట్ల వరకు బకాయిలు రావాల్సి ఉంది. కాగా అధికారులను ఎన్నిసార్లు అడిగిన దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారని సర్పంచ్‌లు వాపోతున్నారు.

రూ. 20 లక్షలు రావాలి



గ్రామంలో చేపట్టిన పనులకు సంబంధించి రూ. 20 లక్షల వరకు రావాల్సి ఉంది. పనులు చేసి ఏడాది గడుస్తున్నా అధికారులు స్పందించటం లేదు. పనులు చేయలేదంటూ నిత్యం ఇబ్బందులు పెట్టిన అధికారులు తీరా పూర్తి చేశాక గ్రామాల వైపు చూడటం లేదు. అప్పులు చేసి పనులు చేశాం. ఇబ్బందులు పడుతున్నాం.

– కృష్ణ, సర్పంచ్, పోమాల్

ఆదుకోవాలి



గ్రామం కోసం రూ.లక్షలు అప్పులు తెచ్చి పనులు చేశాం. తీరా పదవీ కాలం పూర్తి కావస్తున్నా బిల్లుల చెల్లింపు లేదు. చేసిన అప్పులు పెరగటంతో తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నాం. తొందరగా బిల్లులు చెల్లించి సర్పంచ్‌లను కొత్త ప్రభుత్వం ఆదుకోవాలి.

–గోపాల్‌గౌడ్, సర్పంచ్, నవాబుపేట

విడతల వారీగా చెల్లింపు

విడతల వారీగా బిల్లుల చెల్లింపు ఉంటుంది. ప్రభుత్వానికి పనులకు సంబంధించి స్లాబుల వారీగా రికార్డులు చేసి బిల్లుకు పంపిస్తాం. అక్కడి నుంచి విడతల వారీగా బిల్లులు వస్తుంటాయి. మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలకు సంబంధించి బిల్లులు చెల్లించాలని పై అధికారులకు వివరాలు అందించాం.

–శ్రీలత, ఎంపీడీఓ, నవాబుపేట

19న భద్రాచలంలో నాటక ప్రదర్శన

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకు చెందిన జనతా సేవా సమితి ఆధ్వర్యంలో భద్రాచలంలో ఈనెల 19న 'భద్రాద్రి రామదాసు చరిత్ర నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ఓ ప్రకటనలో ప్రతినిధులు పేర్కొన్నారు. వైకుంఠ ఏకాదశీ ప్రయుక్త అధ్యయనోత్సవాలను పురస్కరించుకొని ప్రముఖ నాటక రచయిత వరకవుల నరహరిరాజు రచన, సంగీతం దర్శకత్వంలో ఈ నాటక ప్రదర్శన ఉంటుందని వివరించారు. రామదాసుగా వరకవుల దుర్వాసరాజు, రామ, లక్ష్మణులుగా వెంకటయ్య, తిరుపతయ్యతోపాటు ఇతర కళాకారులు వివిధ పాత్రల్లో నటిస్తారని తెలిపారు.

ఓటరుగా నమోదు చేయించాలి



చిన్నచింతకుంట: అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయించాలని రిటర్నింగ్ అధికారి, స్పెషల్ కలెక్టర్ నటరాజ్ బీఎల్‌ఓలకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో బీఎల్‌ఓలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓటర్ జాబితాలో తప్పులు లేకుండా సరిచూసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, ఆర్‌ఐ తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

స్పోకెన్ ఇంగ్లిష్ తరగతుల పరిశీలన



విద్యార్థులకు డిక్షనరీలు అందిస్తున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పిల్లలమర్రి ఇంగ్లిష్ అకాడమీ ఆధ్వర్యంలో వంద రోజులుగా నిర్వహిస్తున్న స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులను కలెక్టర్ రవి నాయక్ శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులు తప్పులు లేకుండా ఆత్మవిశ్వాసంతో ఆంగ్లంలో మాట్లాడడం తనకు సంతోషాన్ని కలిగించిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పిల్లలమర్రి ఇంగ్లిష్ అకాడమీ నిర్వాహకులను ఆయన అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలను ఇకముందు ముందు అన్ని ప్రభుత్వ హాస్టళ్లలో నిర్వహించడానికి తగిన ప్రోత్సాహం ఇస్తామని కలెక్టర్ తెలిపారు. విదార్థులకు డిక్షనరీలు అందించారు. కాగా ప్రభుత్వ బీసీ, ఎస్సీ బాలికల హాస్టళ్లో ఆరు, ఏడు తరగతులు చదువుతున్న విద్యార్థుల కోసం జూలై నుంచి కార్యక్రమం చేపట్టారు. ఇందుకోసం ఆర్థికసాయం అందించడానికి కలెక్టర్ ముందుకు వచ్చారని.. అందువల్లే విజయవంతంగా నిర్వహించగలిగామని అకాడమీ డైరెక్టర్లు డాక్టర్ విజయకుమార్, అబ్దుల్ రజాక్ తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీ డెవలప్మెంట్ ఆఫీసర్ ఇందిరా, జిల్లా ఎస్సీ డెవలప్మెంట్ ఆఫీసర్ పాండు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: నూతన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను జిల్లా ఎన్ఎస్‌యూఐ నాయకులు మహ్మద్ అవేజ్ అహ్మద్, తదితరులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించారు. అదే విధంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కను సన్మానించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ నయీం సద్దాం, నాయకులు సందీప్, విజయ్ యాదవ్, కర్ణం సురేష్, నవాజ్, సమీర్, ముహిబ్, అంజద్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించి ఇవ్వాలని వినతి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: పట్టణంలోని శ్రీనివాస్‌కాలనీలో ఇందిరాగాంధీ హయాంలో సర్వే నెం.211లో తమకు కేటాయించిన ప్లాట్లలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరుతూ జిల్లా నాయీ బ్రాహ్మణ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు వివరాలను ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఎన్నిసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయిందని వాపోయారు.

మండల అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్

మిడ్జిల్: మండల అభివృద్ధి కోసం అందరు సహకరించాలని ఎంపీపీ సుదర్శన్, జెడ్పీటీసీ శశిరేఖ కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుదర్శన్, అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ 9సంవత్సరాలుగా మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేశారని, నూతన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సైతం అదేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. వేసవి కాలంలో తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. అంతకుముందు వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదవి వినిపించారు. సమావేశంలో తహసీల్దార్ రాజునాయక్, ఎంపీడీఓ సాయిలక్ష్మి, వైఎస్ ఎంపీపీ తిరుపతమ్మ, ఎంపీటీసీలు యశోద, వసంత, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి వివిధ గ్రామాల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్‌లో క్షయ నిర్ధారణ పరీక్షలు



మిడ్జిల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి శివకాంత్ తెలిపారు. శిబిరంలో టీబీ నిర్ధారణ అధికారి రఫీక్, గోపాల్, దేవయ్య, జంగయ్య, సంపత్‌కుమార్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి



తెలంగాణ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

- జిల్లా కేంద్రంలో నిరసన

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో జీవనోపాధికి విఘాతం ఏర్పడిందని పలువురు ఆటో కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో శుక్రవారం ఆటో కార్మికులు నిరసన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వి.శ్రీనివాసులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పెట్టడం వల్ల జీవనోపాధి కోల్పోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు రోజుల నుంచి ఆటోలు సరిగ్గా నడవకపోవడంతో కుటుంబ పోషణకు ఇబ్బందిగా మారిందన్నారు. జిల్లాలో వేలాది ఆటో డ్రైవర్ల పరిస్థితి దుర్భరంగా మారిందన్నారు. ప్రభుత్వం పునరాలోచించాలని, ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణాన్ని రద్దు చేసి తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో భవిష్యత్తులో రోడ్డుపైకి వచ్చి ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం ఆటోలతో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. ఆటో డ్రైవర్లు యాసిన్, రాజు, నాగేష్, వీరేష్, నర్సింలు, యాదయ్య పాల్గొన్నారు.

బడిబయటి పిల్లల సర్వే

మహమ్మదాబాద్: బడికి వెళ్లని బాలకార్మికుల వివరాలు సంబంధిత అధికారులు సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని కంచన్‌పల్లి ఇటుక బట్టీల్లో బాలకార్మికుల వివరాలు సేకరించారు. ఆయా బట్టీల్లో పని చేస్తేన్న బాల కార్మికులను బడికి వెళ్లని చిన్నారులను వారి తల్లి దండ్రులతో మాట్లాడి కంచన్‌పల్లి పాఠశాలలో చేర్పించినట్టు సీఆర్‌పీ వెంకట్ తెలిపారు. కాగా ఆయా గ్రామాల్లో ఇంకా బడిబయటి పిల్లలు ఉన్నట్లు విద్యావంతులు తెల్పుతున్నారు. గ్రామాల్లో పనిచేస్తున్న వలస కార్మికులు గద్వాల్ తదితర చోట్ల నుంచి వచ్చి ఇటుక బట్టీల్లో పనిచేస్తున్నారని.. పాఠశాలకు వెళ్లడానికి తగిన వసతులు లేకపోవడంతో వారి పిల్లలు బాలకార్మికులుగా మారుతున్నట్లు పేర్కొంటున్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



చిన్నచింతకుంట: మండల కేంద్రంలోని ఎంబీ సీయోన్ చర్చ్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంబీ బోర్డు ఆఫ్ ఎడ్యుకేషన్ అధ్యక్షుడు జి.యోనగారి అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు ఎంబీ కాన్ఫరెన్స్ జీసీ ప్రెసిడెంట్ రెవ, ఆశీర్వాదం ముఖ్యఅతిథిగా హాజరై కేక్‌ను కట్‌చేశారు. అనంతరం శుభాకాంక్షలు తెలియజేశారు. బండా సునీల్‌తో సంఘ సభ్యులు మెన్ని జోయెల్, అయ్యన్న, రాజేందర్, శ్యామ్‌రావు, ఎస్ శేఖర్, మోషే, ప్రకాశం, సుదర్శన్, జి.పిలోగ్, విజయ భూషణం తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ లేక ఇబ్బందులు

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలో ఆధార్ సెంటర్ లేక ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారు. ఆధార్ కార్డుల అప్‌డేట్, అడ్రస్‌ల మార్పు కోసం ప్రజలు ఇతర పట్టణాలకు వెళ్లవలసిన పరిస్థితి వస్తోందని వాపోతున్నారు. జిల్లా కేంద్రానికి లేదా మరికల్, ధన్వాడకు వెళ్తున్నారు. ఇటీవల మరికల్‌లో ఆధార్ సెంటర్ మూత పడడంతో పరిస్థితి మరి దారుణంగా మారింది. ఇక జిల్లా కేంద్రంలో అయితే ముందుగా వెళ్లి ఆధార్ కేంద్రంలో టోకెన్ తీసుకోవాల్సి వస్తోంది. దేవరకద్రలో ఏడాది కాలంగా ఆధార్ కేంద్రాన్ని మూసి వేశారు. జిల్లా అధికారులు, మండల అధికారులకు కనీసం ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలనే ఆలోచన రాకపోవడంపై ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో సరైన కార్యాలయాలు లేక పోవడంపై విమర్శలు వస్తున్నాయి. జిల్లా అధికారులు వెంటనే స్పందించి ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ఇతర ప్రాంతాలకు వెళ్లే ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

అధిక వసూళ్లు..

దేవరకద్రలోని మీ సేవా కేంద్రాలు నిర్ణయించిన రుసుముకన్నా ఎక్కువగా వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన దాని ప్రకారం కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం రూ. 45 తీసుకోవాలి, కానీ కొన్నిచోట్ల రూ. 60 వరకు వసూలు చేస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే రసీదులు కూడా ఇవ్వడం లేదని వాపోతున్నారు. విషయంలో అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

భూత్పూర్: రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం మేరకు అమరచింత నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి భూత్పూర్ వైపు నుంచి కొత్తకోట వైపు వెళ్తున్న బోలేరో వాహనాన్ని ఢీకొంది. దీంతో కారులో ఉన్న హైదరాబాద్‌కు చెందిన అఖిల, నరేష్ దంపతులతో పాటు బోలేరో ఉన్న డ్రైవర్ రాములు సాగర్, విజయ్ సాగర్‌కు గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ తెలిపారు.

కారు బోల్తా : తప్పిన ముప్పు

అడ్డాకుల: సంకలమద్ది శివారులో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి ప్రమాదం తప్పిపోయింది. కొమిరెడ్డిపల్లికి చెందిన ఆటో పెట్రోల్ బంకులోంచి హైవే మీదకు వస్తోన్న సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల నుంచి హైదరాబాద్ వైపు ఓ కారు వెళ్తోంది. ఈ క్రమంలో ఆటో అడ్డురావడంతో కారులో ఉన్న మధుసూదన్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో అది అదుపు తప్పి ఆటోకు తగిలి రోడ్డుపై బోల్తాపడింది. మధుసూదన్‌తో పాటు మరొకరు స్వల్ప గాయాలతో నుంచి బయటపడ్డారు. ఆటోను డ్రైవర్ అకస్మాత్తుగా రోడ్డు మీదకు తేవడంతోనే ప్రమాదం సంభవించినట్లు తెలిసింది. ఆటోలో ఉన్న సంచులు పడి పగిలిపోయి బియ్యం రోడ్డుపై పడ్డాయి. ప్రమాదానికి గురైన కారును టోల్ ప్లాజా సిబ్బంది క్రేన్ సాయంతో మూసాపేట ఠాణాకు తరలించారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు చెప్పారు.

అప్‌డేట్ కోసం 'ఆధార్'లక్యూ



నవాబుపేట: ఆధార్‌కార్డులు అప్‌డేట్ చేయాలంటూ జనం ఎగబడుతున్న తరుణంలో.. మండల కేంద్రంలోని సెంటర్ చెంత అదే కార్డులను స్థానికులు క్యూలైన్లో పెట్టారు. ప్రస్తుతం గ్యాస్ కనెక్షన్, రేషన్ కార్డు తదితరాల కోసం ఆధార్ అప్‌డేట్ అయి ఉండడం తప్పనిసరిగా మారింది. దీంతో ప్రజలు ఆధార్ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. శుక్రవారం కేంద్రం తెరుచుకోక ముందే కార్డులను లైన్‌లో పెట్టి ఎదురు చూశారు. గంటల తరబడి వేచి చూడాల్సి రావటంతో కార్డులను క్యూలో ఉంచారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

కోయిల్‌కొండ: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టికాహారాన్ని మెనూ ప్రకారం అందించాలని ఎంపీడీఓ జయరాములు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పల్లుతండా, చింతల్‌తండా, జమాల్‌పూర్, మోదీపూర్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. నర్సరీలను తనిఖీ చేశారు. అనంతరం గ్రామపంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు.

కుటుంబ నియంత్రణపై అవగాహన అవసరం

నవాబుపేట: కుటుంబ నియంత్రణలో స్త్రీలతో పాటు పురుషుల పాత్రకూడా కీలకమని మండల వైద్యాధికారి డాక్టర్ నవీన్‌చంద్ర తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో సర్పంచ్ గోపాల్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన వేసెక్టమీ ఆపరేషన్‌లపై జరిగిన అవగాహన సదస్సులో ప్రసంగించారు. పురుషులకు 5 నిమిషాల వ్యవధిలో ఆపరేషన్ పూర్తి చేస్తారని అన్నారు. ఆపరేషన్ చేయించుకున్న వారికి ప్రభుత్వం పారితోషికం అందిస్తుందని వివరించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ నెల 22న శిబిరం ఉంటుందని వినియోగించుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది శరభలింగం, రాఘవేందర్, అవినాష్, రాములు, బాలమ్మ, రజిత తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన మండల కోఆప్షన్ సభ్యుడు ఖాజాఘోరీ తండ్రి బషీర్‌ఘోరీ అనారోగ్యానికి గురై ఇంటి వద్ద ఉండి కోలుకుంటున్నారు. బాధితుడిని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.